క్లుప్తంగా

పక్షుల కేంద్రంలో జీవవైవిధ్యంపై అవగాహన

దొరవారిసత్రం : నేలపట్టు పక్షుల కేంద్రంలో సోమవారం వన్యప్రాణి విభాగం అధికారులు జీవ వైవిధ్యంపై స్థానికులకు అవగాహన కల్పించారు. సూళ్లూరుపేట సబ్ డివిజన్ డీఎఫ్‌వో హారిక మాట్లాడుతూ జీవవైవిధ్యంలో ప్రతి జీవరాశినీ కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. రాష్ట్ర జీవవైవిధ్యం బోర్డ్ సభ్యుడు రిటైర్డ్ డీఎఫ్‌వో ఖాదర్ వలి, ఎఫ్ఎస్‌వో బాలయ్య పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం

దొరవారిసత్రం : మండలంలోని పలు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం కింద పండించిన కూరగాయాలు, ఆకుకూరలను సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన వ్యవసాయ వనరుల విక్రయ కేంద్రంలో విక్రయించారు. రైతులు ప్రకృతి వ్యవసాయం కింద రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకుండా సాగు చేసిన వాటినే ఇక్కడ విక్రయిస్తున్నామని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తెలిపారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్న వైద్యులు

దొరవారిసత్రం : మండలంలోని తల్లంపాడులో సోమవారం తిరుపతి స్విమ్స్, శ్రీబాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. ప్రతి ఒక్కరూ మద్యం, గుట్కా, సిగరెట్ తదితర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని వైద్యులు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు భాను, తరుణ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతోనే మండల అభివృద్ధి

వెంకటగిరి రూరల్ : అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ తంబిరెడ్డి తనుజారెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో బుల్లితెర నటి శ్రీసత్య



రాపూరు: మండలంలోని పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వామిని సోమవారం బుల్లితెర నటి శ్రీసత్య దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ సిబ్బంది స్వాగతం పలికి మూడు ఆలయాల్లో ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పౌష్టికాహారం పంపిణీ

గూడూరు రూరల్ : గూడూరు పరిసర ప్రాంతాల్లో ఉంటున్న ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు 30 మందికి సోమవారం డాక్టర్ సీఆర్‌రెడ్డి ఆరోగ్య సంజీవని పథకం కింద నెలకు సరిపడా పౌష్టికాహారం అందజేశారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు డాక్టర్ సీఆర్ రెడ్డి కుటుంబ సభ్యులు డాక్టర్ రోహిణి, డాక్టర్ జనార్ధనరెడ్డి చేస్తున్న సేవలు అభినందనీయమని ప్రగతి సేవా సంస్థ ప్రతినిధులు కొనియాడారు.

ఎరువుల కొరత లేకుండా చూడాలి

సూళ్లూరుపేట రూరల్ : రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలని ఏడీఏ అనిత ఆదేశించారు. ఆమె సోమవారం సూళ్లూరుపేట వ్యవసాయ సబ్ డివిజన్ కార్యాలయంలో మందుల దుకాణాల డీలర్లతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ పురుగు మందులు ఎంత మోతాదులో వాడాలో రైతులకు వివరించాలన్నారు. ఏఓ కవిత పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

దక్కిలి : మండలంలోని డ్వాక్రా సంఘాల మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నట్టు ఏపీఎం జమునారాణి తెలిపారు. ఆమె సోమవారం వెలుగు ప్రాజెక్టు కార్యాలయంలో పొదుపు సంఘాల నిర్వహణ, మహిళలకు సంబంధించిన పథకాల అమలుపై కమ్యూనిటీ కో–ఆర్డినేటర్లతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ మండలంలో ఉన్న అన్ని పొదుపు సంఘాలకు సకాలంలో రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీసీలు వెంకటేశ్వర్లు, సురేష్, రాజేశ్వరి పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

రాపూరు: రాపూరు తూర్పు అగ్రహకట్టకు వెళ్లే మార్గంలో సోమవారం ఒక వ్యక్తి ఒక్కసారిగా కుప్పకూలిపడిపోయాడు. గమనించిన స్థానికులు అక్కడికి చేరుకుని పరిశీలించగా గుండెపోటుతో మృతి చెందినట్లు తెలుసుకున్నారు. అతని వద్ద ఉన్న సెల్ ఫోన్ ఆధారంగా ఫోన్ చేస్తే అతని పేరు శివ అని, గూడూరుకు చెందిన వ్యక్తిగా తేలింది. రాపూరులో ఎలక్ట్రీషియన్ పని చేసేందుకు వచ్చినట్లు తెలిపారు. శివ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సూళ్లూరుపేట : పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయం సమీపంలో వున్న 33–11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్, మన్నేముత్తేరి, మన్నారుపోలూరు సబ్ స్టేషన్లలో మెయింటినెన్స్ పనులు చేస్తున్న నేపథ్యంలో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏడీ ఆర్.శేఖర్ తెలిపారు. సూళ్లూరుపేట పట్టణం పూర్తి, మన్నారుపోలూరులో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

గూడూరు ప్రాంతంలో చుక్క నీరు లేని మల్లిమడుగు చెరువు



దుక్కి దున్నిన భూమి



ఎండిపోయిన కాళంగినది



చినుకు రాలదు.. సాగు సాగదు

భారీ వర్షాలతో విజయవాడ, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి, కాకినాడ, విశాఖపట్టణం తదితర ప్రాంతాలు అతలాకుతలం అవుతున్నాయి. దక్షిణ కోస్తాలో చినుకు జాడ లేదు. చెరువులు, కాలువలు అడుగంటాయి. వేసవిని తలపించేలా ఎండలు కాస్తుండడంతో చెరువుల్లో ఉన్న కొద్దిపాటి నీరు కూడా ఎండిపోయింది. సాధారణంగా వినాయక చవితి పండుగకు వినాయకుడి అంత ఎత్తు ఎల్లిపైర్లు వుంటాయని పెద్దలు చెబుతూ ఉంటారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చినుకు కోసం ఆకాశం వైపు చూస్తున్నారు

- కనిపించని వాన జాడ
- పచ్చరొట్టె విత్తనాలు కూడా చల్లని రైతులు
- ఎండిన చెరువులు, కాలువలు
- బీళ్లుగా మారిన ఆయకట్టు భూములు
- పశువులకు తాగునీటికీ ఇబ్బంది



ఎండిపోయిన శిరసనంబేడు చెరువు

చిల్లకూరు/సూళ్లూరుపేట : గూడూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని చెరువుల్లో ఒక్క దానిలో కూడా చుక్క నీరు లేదు. సూళ్లూరుపేట నియోజకవర్గంలోని మండలాల్లోని పరిస్థితి కూడా అదేవిధంగా ఉంది. వాతావరణ శాఖ తుపానులు ఏర్పడుతున్నట్టు సమాచారం ఇస్తుంటే ఈ ఏడాది బాగా వర్షాలు కురుస్తాయని, సాగు, తాగునీటికి ఢోకా ఉండదని రైతులు అనుకున్నారు. రుతుపవనాలు కూడా తిరోగమనం పట్టడంతో ఈ ఏడాది పంటల సాగు ఎలా అని మథన పడుతున్నారు. గూడూరు నియోజకవర్గంలోని కోట, వాకాడు, చిట్టమూరు తీర ప్రాంత మండలాల్లో బోర్లు ఉన్నప్పటికీ భూగర్భ జలాలు అడుగంటిపోతుండడంతో పూర్తి స్థాయిలో సాగు చేపట్టలేకపోతున్నారు. అలాగే సూళ్లూరుపేట, దొరవారిసత్రం, తడ మండలాలకు నెర్రికాలువ, పెళ్లకూరు మండలానికి పాలచ్చూరు కాలువ కొంత వరకు నీరు అందిస్తాయి. అలాగే తెలుగుగంగ మెయిన్ కెనాల్ నుంచి తమిళనాడుకు నీరు వదిలినప్పుడు వాగులు, వంకల ద్వారా కొన్ని చెరువులను నింపుకునే వీలుంది. ప్రస్తుతం గంగనీరు కూడా రాకపోవడంతో సూళ్లూరుపేట నియోజకవర్గంలోని రైతులు వర్షం కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. ప్రస్తుతం కండలేరు నుంచి చెన్నైకి తెలుగు గంగ ప్రధాన కాలువ ద్వారా నీరు వదలడంతో బ్రాంచి కెనాల్స్‌కు చుక్క నీరు కూడా రావడంలేదు. వర్షాలు లేకపోవడంతో గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది భూగర్భ జలాలు బాగా తగ్గే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.

బీళ్లుగా మారిన ఆయకట్టు భూములు

గూడూరు నియోజకవర్గంలో 249 చెరువులు ఉన్నాయి. వాటి కింద 31 వేల ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. సూళ్లూరుపేట నియోజకవర్గంలో 402 మేజర్, మైనర్ చెరువులున్నాయి. వీటి కింద సుమారు 28,431 హెక్టార్ల ఆయుకట్టు భూముల ఉన్నాయి. సాధారణంగా రబీ సీజన్‌లో 27,747 హెక్టార్లలో వరిసాగు చేస్తారు. ఖరీఫ్ సీజన్‌లో వేసుకున్న వరి పైర్లు కూడా వర్షాలు లేకపోవడంతో అంతంత మాత్రంగానే ఫలితాలనిచ్చాయి. బోర్లు, బావుల్లోనూ భూగర్భ జలాలు తగ్గిపోవడంతో సక్రమంగా నీరు రావడం లేదు. మామూలుగా సెప్టెంబర్ నెలకంతా వర్షాలు పడి నార్లు పోసుకోవడంతో పాటు ఎల్లిపైర్లకు మందుల పిచికారీ పనులతో రైతులు బిజీగా వుంటారు. ఈ ఏడాది జూలై నుంచి ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం కూడా నమోదు కాలేదు. దీంతో చెరువుల కింద ఉన్న ఆయకట్టు భూములు బీళ్లగా మారాయి. రబీ సాగు ప్రశ్నార్థకంగా మారింది.

పచ్చరొట్టె విత్తనాలు చల్లేందుకూ వీలుకాని పరిస్థితి

పంటలు సాగుకు ముందుగా భూమిని సారవంతం చేసుకునేందుకు అధికారులు పిల్లిపెసర, జీలుగ తదితర పచ్చరొట్టె విత్తనాలను అందజేశారు. వాటిని చల్లుకుందామన్నా భూమిలో తడి లేక అవి మొలకెత్తే అవకాశం లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు.

అక్టోబర్ వచ్చినా కనిపించని చినుకు జాడ

సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలలంటే ఈ ప్రాంతంలో తుపాన్ మాసాలుగా పేరుంది. బంగాళాఖాతంలో అల్పపీడనాలు, ద్రోణులు ఏర్పడితే గాని వర్షాలు పడేలా కనిపించడం లేదు. గత ఏడాది అతివృష్టి వల్ల వరదలొచ్చి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది జూలై నుంచి అడపదడపా వర్షాలు కురుస్తున్నా ఒక్క పదును కూడా కావడం లేదు. అక్టోబర్ ప్రారంభమై వారం గడిచినా చినుకు జాడ లేకపోవడంతో రైతుల్లో ఆశలు సన్నగిల్లుతున్నాయి.

వైఎస్సార్ హయాంలో పుష్కలంగా వర్షాలు

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఆరేళ్ల ప్రతిఏటా పుష్కలంగా వర్షాలు కురిశాయి. ఆయన కుమారుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనూ వర్షాలు బాగా కురిసి పంటలు పండాయి. చంద్రబాబునాయుడు ఎప్పుడు ముఖ్యమంత్రి అయినా వరుణ దేవుడు కరుణించడం లేదని, ప్రస్తుతం రాష్ట్రంలో ఒకవైపు అతివృష్టి, మరో వైపు అనావృష్టి పరిస్థితులు నెలకొన్నాయని రైతులు చెబుతున్నారు.

చినుకు జాడ లేదు



సెప్టెంబర్ నెలలో పచ్చరొట్టె విత్తనాలు చల్లుకుని 40 రోజులు పంటను ఉంచి దాన్ని భూమిలో తొక్కిస్తే సత్తువ బాగా వస్తుంది. చినుకు పడకపోవడంతో ఇప్పటి వరకు దుక్కులు కూడా దున్న లేదు. పదను లేకపోవడంతో పచ్చరొట్ట విత్తనా లు ఎలా చల్లుకోవాలి. ఈ నెలంతా ఇలాగే ఉంటే జనవరిలో పంటలు సాగు చేసుకోవాల్సిందే.

– రవీంద్రరెడ్డి, నెలబల్లిరెట్టపల్లి, చిల్లకూరు మండలం

దుక్కులు చేద్దామంటే భూమిలో తడి లేదు



వేసవి పూర్తయిన తర్వాత దుక్కులు చేస్తే భూమిలో చెడు సూక్ష్మజీవులు చనిపోతాయి. తర్వాత పంటలు సాగు చేస్తే ఇబ్బంది ఉండదు. అప్పుడప్పుడు వర్షం కురుస్తున్నా భూమిలో నాగలి దిగేంత వర్షం కాకపోవడంతో దుక్కులు చేయలేకపోతున్నాం. ఇలాగే ఉంటే ఈ ఏడాది వరి పంటలు సాగు చేయలేము.

– వేమయ్య, చిల్లకూరు

నష్ట పరిహారం చెల్లించాలని రైతుల వినతి

కోట: ఏపీఐఐసీ తీసుకున్న భూములకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరారు. కొత్తపట్నంలో సోమవారం గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నై–బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా పరిశ్రమల కోసం భూములు ఇచ్చిన రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. రైతులు మాట్లాడుతూ పరిశ్రమలకు భూములు ఇచ్చి తాము జీవనోపాధి కోల్పోయామని తెలిపారు. వెంటనే నష్టపరిహారం చెల్లిస్తే ఏదైనా వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తామని చెప్పారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఇక్కడ 445 ఎకరాల మేర ప్రభుత్వ భూములు ఉన్నాయని తెలిపారు. వాటిని సాగు చేసుకుంటున్న రైతులందరికీ నష్ట పరిహారం చెల్లిస్తామని తెలిపారు. కమిటీ నివేదిక ప్రకారం ప్రభుత్వ భూములు ఎకరాకు రూ.4 లక్షలు ఇస్తామని సబ్‌కలెక్టర్ పేర్కొన్నారు. ఎకరాకు రూ.10 లక్షలు ఇవ్వాలని కోరారు. కొత్తపట్నంలో క్రిస్‌సిటీ ఏర్పాటు కానుందని, ఈ ప్రాంత అభివృద్ధికి అందరూ సహకరించాలని సబ్ కలెక్టర్ కోరారు. గ్రామసభలో తహసీల్దార్ జయజయరావు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆక్రమణ భూములు పేదలకు ఇప్పించాలి

పెళ్లకూరు: మండలంలోని శెట్టిగుంట రెవెన్యూలో ఉన్న సర్వే నంబరు 101–118లో ప్రభుత్వ ఆక్రమణ భూములను స్వాధీనం చేసుకొని నిరుపేదలకు పంపిణీ చేయాలని పునబాక గ్రామానికి చెందిన దళిత నాయకుడు యాగాని బెన్నీ కోరారు. ఆయన సోమవారం పెళ్లకూరు రెవెన్యూ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌డేలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. శెట్టిగుంట రెవెన్యూలో ఉన్న ప్రభుత్వ భూములను తిరుపతికి చెందిన ఓవ్యాపారవేత్త కబ్జా చేసి జామాయిల్ మొక్కలు సాగు చేస్తున్నట్లు వివరించారు. గ్రామంలో చాలా మంది నిరుపేదలు సెంటు భూమి కూడా లేకుండా తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నాడు. వ్యాపారవేత్త ఆక్రమించుకున్న కాలువ, వాగు పోరంబోకు భూములను సర్వే చేసి పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశాడు.

కండలేరులో 27.526 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 27.526 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయిగంగ కాలువకు 1250, పిన్నేరు కాలువకు 40, లోలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నా రు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 8000 క్యూసెక్కుల నీరు చేరుతోందని వెల్లడించారు.

ఎస్టీల సమస్యల ఏకరువు

- కలుజుమిట్ట ఎస్టీ కాలనీలో ఎస్టీ కమిషన్ సమావేశం
- హాజరు కాని అధికారులపై అసహనం



మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ సభ్యులు శంకర్‌నాయక్

దొరవారిసత్రం : మండలంలోని కొత్తపల్లి పంచాయతీ కలుజుమిట్ట ఎస్టీ కాలనీలో సోమవారం ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ గిరిజనులతో సమావేశమయ్యారు. ఈ క్రమంలో పలువురు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. కాలనీకి శ్మశానం స్థలం లేదని, 20 ఏళ్ల క్రితం వీఆర్వో సంస్థ వారు నిర్మించిన పక్కాగృహాలు శిథిలావస్థకు చేరుకోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. వీధుల్లో విద్యుత్ దీపాలు, అంతర్గత రోడ్లు లేవని తెలిపారు. 40 కుటుంబాల వారు అటవీ ప్రాంతంలోని కొంత భూమిని సాగు చేసుకుంటున్నామని, వాటికి పత్రాలు లేకపోవడంతో ప్రభుత్వ రాయితీలు అందడం లేదని తెలిపారు. స్పందించిన ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను కమిషన్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. గిరిజనులు ఉన్నత చదువులను చదివితేనే పేదరికం పోతుందని వివరించారు. సమావేశానికి పలు శాఖ అధికారులు హాజరుకాకపోవడంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో తహసీల్దార్ శైలకుమారి, ఎంపీడీవో గోవర్ధన్, సర్పంచ్ నాగూరయ్య, ఏవో రఘురామయ్య, సుభాషిణి, బేబిరాణి, కస్తూరయ్య, కృష్ణయ్య, హరికృష్ణ, ఉషారాణి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భూ సారం ఆధారంగా పంటలు సాగుచేసుకోవాలి

వెంకటగిరి రూరల్ : రైతులు భూసారం ఆధారంగా పంటలు సాగుచేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాజీవన తెలిపారు. మండలంలోని ఎండికండ్రిగలో సోమవారం శ్రీనివాసన్ సేవా సంస్థ, కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా భూసార పరీక్షల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ రైతులు భూ సార పరీక్షల అనంతరం శాస్త్రవేత్తలు, అధికారుల సూచనల మేరకు పంటలు సాగుచేస్తే అధిక దిగుబడి సాధించవచ్చన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం



గూడూరు రూరల్ : చదువుకునేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విద్యార్థినికి సోమవారం రూ.10 వేల సాయం అందించినట్టు రోటరీ వెస్ట్ క్లబ్ సీనియర్ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి తెలిపారు. నీరజ అనే విద్యార్థిని బీఎస్సీ చదువుతోందన్నారు. పేద కుటుంబానికి చెందిన ఆమె ఆర్థిక స్థోమతలేక ఇబ్బంది పడుతుండడంతో ఇసనాక శ్రీనివాసులురెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు మహేష్‌రెడ్డి ఆర్థిక సాయం అందించాడన్నారు. క్లబ్ అధ్యక్షుడు నాశిన నాగులు, కార్యదర్శి గిరిబాబు, దువ్వూరు రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

రసాభాసగా గ్రామసభ

చిల్లకూరు : తమ్మినపట్నం రెవెన్యూలో క్రిస్ సిటీ కోసం సేకరించే భూములకు పరిహారం విషయంలో సోమవారం నిర్వహించిన గ్రామసభ రసాభాసగా మారింది. ఎకరాకు రూ.10 లక్షలు ఇస్తేనే భూములు ఇస్తామని గ్రామస్తులు స్పష్టం చేశారు. క్రిస్ సిటీ కోసం ప్రభుత్వం 914 ఎకరాలను ఏపీఐఐసీ ద్వారా సేకరించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా నాలుగు పర్యాయాలు సర్వే చేసి లబ్ధిదారుల జాబితా రూపొందించారు. ఈ క్రమంలోనే రైతుల అభిప్రాయాలు సేకరించేందుకు గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా ఆధ్వర్యంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఎకరాకు రూ.4.40 లక్షలు అందజేస్తామని ప్రకటించారు. దానికి రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎకరాకు రూ.10 లక్షలు ఇవ్వాల్సిందేనని రైతులు పట్టుబట్టడంతో గ్రామసభ రసాభాసగా మారింది. సబ్ కలెక్టర్ గ్రామస్తులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ఫలితం లేదు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఏపీఐఐసీ ప్రతినిధి, విజయకుమార్, వీఆర్వో బాలాజీ, తమ్మినపట్నం, లింగవరం సర్పంచులు నెల్లిపూడి సుబ్రమణ్యం, నాశిన సుబ్రమణ్యం, వరగలి ఎంపీటీసీ దారా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ పాలనలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న ఎంపీపీ గోను రాజశేఖర్

దక్కిలి : పంచాయతీ పాలనలో ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు భాగస్వాములు కావాలని ఎంపీపీ గోను రాజశేఖర్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం వార్డు మెంబర్లు, ఉప సర్పంచ్‌లకు శిక్షణఇచ్చారు. ఎంపీపీ మాట్లాడుతూ వార్డు మెంబర్లు సమావేశాలకు విధిగా హాజరై వార్డుల్లోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ పథకాలు అందరికీ చేరాలి

బాలాయపల్లి(సైదాపురం): అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా ప్రజా ప్రతినిధులు చూడాలని ఎంపీడీవో వినీల్‌కుమార్ తెలిపారు. స్త్రీశక్తి భవనంలో సోమవారం ఉప సర్పంచులు, వార్డు మెంబర్లకు శిక్షణ ఇచ్చారు.

పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

నాయుడుపేట టౌన్ : పంచాయతీల అభివృద్ధిపై సర్పంచ్‌లతో పాటు ఉప సర్పంచులు, వార్డు సభ్యులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మీ కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు రెండు రోజుల శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఎంపీడీవో కోటూరు సురేష్ బాబు, ఏవో భువనేశ్వర శర్మ పాల్గొన్నారు.

ఘనంగా వెంకన్న నగరోత్సవం



కల్యాణ వెంకటేశ్వర స్వామి నగరోత్సవం

నాయుడుపేట టౌన్ : బ్రాహ్మణవీధిలో వెలసిన కల్యాణ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. రాత్రి స్వామి, అమ్మ వార్ల నగరోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మంగళవారం శ్రీవారి కల్యాణం, 11న చక్రస్నానం, 12 సాయంత్రం పుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ ధర్మకర్త చదలవాడ మోహన్ కృష్ణ శర్మ తెలిపారు.

గాయత్రీదేవీగా కన్యకాపరమేశ్వరి



చిల్లకూరు : గజలక్ష్మీగా ఆదిలక్ష్మీ

కోట/సైదాపురం/చిల్లకూరు/రాపూరు/నాయుడుపేటటౌన్/చిల్లకూరు/వెంకటగిరిరూరల్ : గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లో దేవీ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా జరుపుకుంటున్నారు. అమ్మవార్లు ప్రతిరోజూ ఒక్కో అలంకరణలో భక్తులకు దర్శనం ఇస్తున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు.

- కోట తూర్పువీధిలో శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు సోమవారం గాయత్రీదేవిగా భక్తులను అనుగ్రహించారు. వైష్ణవి దుర్గాదేవి అమ్మవారు త్రిపురభైరవిగా అలంకరించి భక్తులు పూజలు చేశారు.
- సైదాపురంలో ఉన్న బాలా త్రిపురసుందరీదేవీ అమ్మవారు సోమవారం లలితా దేవిగా భక్తులను అనుగ్రహించారు. అమ్మవారికి వివిధ పుష్పాలు, ఆభరణాలతో అలంకరించారు.
- చిల్లకూరు మండలం తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ అమ్మవారు సోమవారం కాసుల చీర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.
- రాపూరు: పెంచలకోనలో వెలసిన పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఉన్న ఆదిలక్ష్మీదేవి సోమవారం రాత్రి గజలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేపినాపి సమీపంలోని అంకమ్మ లలితా త్రిపుర సుందరిదేవిగా అనుగ్రహించారు. రాపూరు గ్రామ దేవత రాపూరమ్మ మహాచండిగా భక్తులకు దర్శనమిచ్చారు. రాపూరులోని కన్యకాపరమేశ్వరి అమ్మవారిని రాజరాజేశ్వరిదేవిగా అలంకరించారు.
- నాయుడుపేట గ్రామ దేవత పోలేరమ్మ, ముకాంబికా దేవి అమ్మవార్లు అన్నపూర్ణగా భక్తులను అనుగ్రహించారు.
- చిల్లకూరు మండలం తూర్పుకనుపూరులో ఉన్న ముత్యాలమ్మ సోమవారం మహాలక్ష్మీగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని అర్ధ రథంపై ఉంచి మాడ వీధుల్లో ఊరేగించారు. కలవకొండలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదిలక్ష్మీ అమ్మవారు గజలక్ష్మీగా దర్శనం ఇచ్చారు. భక్తులకు అన్నదానం చేశారు.
- వెంకటగిరి పట్టణం కర్ణమ్మవీధిలోని హరహర క్షేత్రంలోని కాత్యాయని దేవి కామక్షమ్మగా, వెంకటేశ్వరస్వామి వామనావతరంలో భక్తులకు దర్శనమిచ్చారు. వెలమపాళెం సమీపంలో ఉన్న మందనాంచారమ్మ మదురమీనాక్షిగా, కన్యకా పరమేశ్వరి కంచి కామాక్షిగా దర్శనమిచ్చారు.

అష్టకాళీగా చెంగాళమ్మ పరమేశ్వరి



సూళ్లూరుపేట: దసరా ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజున సోమవారం చెంగాళమ్మ పరమేశ్వరి అష్టకాళీగా భక్తులను అనుగ్రహించారు. యాగశాలలో మహాచండీయాగాన్ని ఘనంగా నిర్వహించారు. అష్టకాళీ అలంకారానికి హైదరాబాద్‌కు చెందిన మద్దాలి శరణ్‌కుమార్‌రెడ్డి, లక్ష్మీప్రియారెడ్డి దంపతులు, చండీయాగానికి సూళ్లూరుపేటకు చెందిన మాదరపాక జగన్ మోహన్, గౌరి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

భక్తిశ్రద్ధలతో సారెల సమర్పణ

సూళ్లూరుపేట చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారికి సోమవారం బాపూజీవీధి, కచ్చేరివీధి, పార్కు వీధి, గాండ్లవీధికి చెందిన భక్తులు సారె సమర్పించారు. మహిళలు చీరలు, రవికెలు, పండ్లు తీసుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. వారికి ఆలయ సహాయ కమిషనర్ బి.ప్రసన్న లక్ష్మీ స్వాగతం పలికి అమ్మవారికి సారె సమర్పించేలా ఏర్పాట్లు చేశారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణం 8వ వార్డు ఎన్‌జీవో కాలనీలో సర్వే నంబర్ 150–11, 151–1లో ప్రజల అవసరాల కోసం కేటాయించిన ప్రభుత్వ భూమిని ఒక వ్యక్తి ఆక్రమించుకుని నిర్మాణం చేపట్టినట్టు స్థానికులు సోమవారం తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థలాన్ని పరిశీలించి ఆక్రమణను తొలగించాలని కోరారు.

బైక్ ఢీకొని ముగ్గురికి గాయాలు

దొరవారిసత్రం : వెదురుపట్టు గ్రామానికి వెళ్లే రోడ్డుపై సోమవారం రెండు బైక్‌లు ఢీకొనడంతో ముగ్గురు గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. బురదమడుగు గ్రామానికి చెందిన మునిరెడ్డి మద్యం మత్తులో బైక్ నడుపుతున్నాడు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను ఢీకొన్నాడు. దీంతో మునిరెడ్డి, మరో బైక్‌లో వస్తున్న చెంచుకృష్ణ, మహాలక్ష్మి గాయపడ్డారు. వారిని స్థానికులు 108లో నాయుడుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుట్టు మిషన్ అందజేత

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని ముత్తూట్ ఎల్లో ఫైనాన్స్ సహకారంతో మాళవ్య నగర్ ప్రాంతానికి చెందిన బొలిగర్ల ఈశ్వరికి కుట్టు మిషన్ అందజేశారు. ముత్తూట్ తిరుపతి ఏరియా మేనేజర్ గోపీనాథ్ మాట్లాడుతూ సీఎస్‌ఆర్ నిధుల కింద పేదలకు సహకారం అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ అనీల్ కుమార్ అనూష, స్వప్న, వెంకటేష్ పాల్గొన్నారు.

మూడు దుకాణాల్లో చోరీ

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని పాత బస్టాండు సమీపంలో ఉన్న మూడు దుకాణాల్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మూడు దుకాణాల్లోనూ కౌంటర్లలో ఉన్న నగదుతో పాటు సిగరెట్ ప్యాకెట్లు, వస్తువులు చోరీ చేసినట్టు బాధితులు తెలిపారు. సెలూన్ దుకాణంలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

జెండా పండుగ ఘర్షణ కేసులో ముగ్గురి అరెస్టు

చిల్లకూరు : గూడూరులో దసరాకు ముందు నిర్వహించే జెండా పండుగలో జరిగిన ఘర్షణ కేసులో ముగ్గురు యువకులను అరెస్టు చేసినట్టు సీఐ శేఖర్ బాబు తెలిపారు. ఆయన సోమవారం ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఈ నెల 3వ తేదీన శివాలయం ప్రాంతంలో జెండా ఊరేగింపులో జరిగిన తోపులాటలో క్రిష్ణ మందిరం వీధికి చెందిన రెహమాన్ అనే యువకుడిపై అరుంధతి వాడకు చెందిన శ్రీనాథ్, ఇమ్మానుయేలు, వెంకటేశ్వర్లు దాడికి పాల్పడ్డారు. ఈ కేసులో నిందితుడు శ్రీనాథ్‌ను తాళ్లమ్మ గిడి వద్ద అరెస్టు చేశామని సీఐ తెలిపారు. చిన్న మసీదు వీధిలో డ్యాన్స్ చేస్తున్న సమయంలో ఏర్పడిన చిన్న తోపులాటలో గూడూరు అశోక్ నగర్ ప్రాంతానికి చెందిన మనోజ్, వెంకటేశ్వర్లు గొడవ పడి హరీష్, యశ్వంత్‌పై కత్తితో దాడి చేశారని తెలిపారు. ఈ కేసులో రైల్వే పార్శిల్ కార్యాలయం వద్ద ఇద్దరు నిందితులను అరెస్టు చేశామని పేర్కొన్నారు. వీరిలో ఒకరు మైనర్ కావడంతో జువైనల్ హోమ్‌కు తరలించినట్టు తెలిపారు. మరో నిందితుడు మనోజ్‌ను కోర్టులో హాజరుపరిచినట్టు తెలిపారు. వీరిపై రౌడీ షీట్ ఓపెన్ చేయనున్నామన్నారు. ఎస్ఐ తిరుమలరావు పాల్గొన్నారు.